నేల బెలుం తిరుణాలకు వేళాయె

- ఈనెల 25న తిరుణాల
- ముమ్మర ఏర్పాట్లు చేస్తున్న ఆలయ కమిటీ
- సుమారు 15 వేల మంది భక్తులు వస్తారని అంచనా



పానిమట్టంపై సాలగ్రామం రూపంలో స్వామి



నేలబెలుం మల్లేశ్వరస్వామి ఆలయం



బిలంలోకి చేరుకునే మార్గం

కొలిమిగుండ్ల: ఆహ్లాదకర వాతావరణంలో భక్తులను ఆకట్టుకునేలా ఉన్న పురాతన నేలబెలుం మల్లేశ్వరస్వామి తిరుణాలకు ఆలయ కమిటీ సభ్యులు సర్వం సిద్ధం చేశారు. ఏటా కార్తీక మాసం కడసోమవారం రోజున తిరుణాల పెద్ద ఎత్తున నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈనెల 25న నిర్వహించనున్నారు. భక్తులకు అసౌకర్యాలు ఎదురుకాకుండా ఉండేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ జిల్లాల నుంచి కడ సోమవారం రోజున 12 నుంచి 15 వేల మంది మేర భక్తులు హాజరవుతారని కమిటీ సభ్యులు అంచనా వేస్తున్నారు. అనంతపురం జిల్లా తాడిపత్రి ఆర్టీసీ డిపో నుంచి నేల బెలుం తిరుణాల రోజు బస్సు సర్వీసులు ఏర్పాటు చేయనున్నారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించనున్నారు. తిరుణాలలో వివిధ ప్రాంతాల నుంచి రైతులు చెరుకు గడలను పెద్ద ఎత్తున తీసుకొచ్చి విక్రయిస్తుంటారు.

మహత్యం గల మల్లేశ్వరుడు

ప్రకృతి రమణీయత మధ్య అవతరించిన ఈ ఆలయం 800 ఏళ్ల కిందట నిర్మించినట్లు ఇక్కడ లభించిన ఆధారాలను బట్టి తెలుస్తోంది. కాశీ తరహాలో ఇక్కడ పానిమట్టంపై స్వామి కొలువై ఉన్నాడు. ఆలయ గోడలపై వివిధ రకాల కుడ్యాలు ఇప్పటికి చెక్కుచెదరకుండా ఉన్నాయి. మల్లేశ్వర స్వామి మహిమగల వాడని భక్తుల ప్రగాఢ నమ్మకం . ఆలయంలో పార్వతిదేవి, విఘ్నేశ్వరస్వామి ఆలయాలు పక్కనే ఉన్నాయి. దేశంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ కార్తీక మాసంలో నెల రోజుల పాటు సూర్యకిరణాలు మూడు గుళ్లలో పడుతాయి. సాధారణ రోజుల్లో కూడా భక్తులు ఇక్కడికి వచ్చి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. ఆలయానికి ఎదురుగా ఉన్న బిలంలో ఉన్న నీటిని పవిత్రమైనదిగా భక్తులు భావిస్తారు. ఇక్కడ నీటిలో పుణ్య స్నానాలు చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. ఈ గుహలో పూర్వం మునీశ్వరులు తపస్సు చేస్తుండేవారు. కళ్యాణ స్వామి అనే మునీశ్వరుడు గుహలోనే రోజుల తరబడి ధ్యానంలో ఉండి కార్తీక మాసం కడ సోమవారం తనువు చాలించారు. అప్పటి నుంచి ఏటా కార్తీక మాసం చివరి సోమవారం రోజున తిరుణాల జరుపుతున్నారు.

నేటి నుంచి మౌలాలీస్వామి ఉరుసు



కొండపేటలోని మౌలాలీ స్వామి దర్గా

డోన్ టౌన్: పట్టణంలోని కొండపేటలో హజరత్ హసన్‌వలి మౌలాలీ స్వామి ఉరుసును ఈ నెల 22వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ కార్యదర్శి ఎస్‌ఏ చిన్న రహిమాన్ తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గంధం ఊరేగింపు, శనివారం ఉరుసు, ఆదివారం కిస్తీ, జియారత్ తదితర కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు. శని, ఆదివారాల్లో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దర్గా కమిటీ సభ్యులు గోపిగౌడ్, అహ్మద్‌బాషా, తెలసీనాయక్, పద్మానాయక్, ముంతాజ్‌నాయక్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

వాహన రికార్డులు తప్పనిసరి



వాహనాలను తనిఖీ చేస్తున్న డోన్ ఎంవీఐ

బేతంచెర్ల: వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్, వాహన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని.. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని డోన్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్ అన్నారు. గురువారం బేతంచెర్లలోని పలు కూడళ్లలో వాహనాలు తనిఖీ చేశారు. రికార్డులు సరిగ్గా లేని, రోడ్డు ట్యాక్స్, బీమా చెల్లించని, లెసెన్సులేని, అధిక లోడుతో వెళ్తున్న వాహనదారులపై కేసులు నమోదు చేసి జరిమానా విధించారు. 9 ట్రాక్టర్లు, 3 గూడ్స్ వాహనాలు, ఒక ద్విచక్రవాహనంపై రూ.2,24,000 జరిమానా విధించారు.

తమ్మడపల్లె సర్పంచ్ మృతి



యన్నం వెంకట్రామిరెడ్డి(ఫైల్)

బనగానపల్లె: మండలంలోని తమ్మడపల్లె సర్పంచ్, వైఎస్సార్ సీపీ నేత యన్నం వెంకట్రామిరెడ్డి(55) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. కొంత కాలంగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈయనకు భార్య రామసుబ్బమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సోదరులు కాటసాని ప్రసాదరెడ్డి, కాటసాని తిరుపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రేపు మాదిగల కార్తీక వనభోజనం

ప్యాపిలి: మండల కేంద్రంలో ఈ నెల 23న మాదిగ కులస్తుల కార్తీక మాస వనభోజనం ఏర్పాటు చేసినట్లు ప్యాపిలి మండల మాదిగ సంఘం నాయకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు స్థానిక అంబేద్కర్ విగ్రహం నుంచి లక్ష్మీనరసింహ ఫంక్షన్ హాల్ సమీపంలోని ఆంజనేయస్వామి గుడి వద్దకు ర్యాలీ ఉంటుందన్నారు. అనంతరం ఉసిరిచెట్టుకు పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు కార్తీక వనభోజనాలు ప్రారంభం అవుతాయని తెలిపారు. మండలంలోని మాదిగ కులస్తులు తరలిరావాలని కోరారు.

రాజ్యాంగ దినోత్సవాన్ని జయప్రదం చేద్దాం

కోవెలకుంట్ల: మండల కేంద్రంలో ఈ నెల 26వ తేదీ తలపెట్టిన 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు రెడ్డిపల్లె ఓబయ్య పిలుపునిచ్చారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, గురుకుల పాఠశాల విద్యార్థులకు భారత రాజ్యాంగంపై అవగాహన కల్పించేందుకు పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

డెంగీ కేసు నమోదు?

డోన్ టౌన్: పట్టణంలోని తారకరామనగర్‌లో ఓ చిన్నారి డెంగీ లక్షణాలతో ఆస్పత్రి పాలైంది. కొద్ది రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురైన బాలికను చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా పరీక్షించిన వైద్యులు డెంగీ లక్షణాలు ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. దీంతో బాలిక తల్లిదండ్రులు కర్నూలు తరలించారు. విషయం తెలుసుకున్న వైద్య ఆరోగ్య సిబ్బంది ఆ కాలనీకి వెళ్లి వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై స్థానికులకు అవగాహన కల్పించారు. పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు సచివాలయ సిబ్బంది, మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు.

ప్రత్యేక ఆధార్ సేవలు పొడిగింపు

బేతంచెర్ల: పట్టణంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ సేవలు శుక్రవారం కూడా కొనసాగుతాయని ఎంఈఓ సోమశేఖర్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

ఆకలి తీర్చడంలోనే ఆత్మ సంతృప్తి

డోన్ టౌన్: తోటి వారి ఆకలి తీర్చినప్పుడే జీవితానికి సార్థకత చేకూరి ఆత్మ సంతృప్తి కలుగుతుందని ఆర్టీసీ డిపో మేనేజర్ శశిభూషణ్ అన్నారు. గురువారం పట్టణంలోని పద్మావతి వృద్ధాశ్రమం, ఓబులాపురం గ్రామ సమీపంలోని కాశిరెడ్డినాయన ఆశ్రమంలో వృద్ధులకు అన్నం వడ్డించారు. తన మామగారైన రఘురామమూర్తి వర్ధంతి సందర్భంగా అన్నదానం చేసినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు అరుణ, వైష్ణవి పాల్గొన్నారు. అలాగే స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వే ఉద్యోగి తంగ రాజన్ జ్ఞాపకార్థం ఆయన సోదరుడు సెల్వరాజ్ స్ఫూర్తి సంస్థ సభ్యుల ద్వారా అన్నం అందించారు.

చదువుతో సమాజంలో గౌరవం



మాట్లాడుతున్న డోన్ డీఎస్పీ శ్రీనివాసులు



అవగాహన సదస్సుకు హాజరైన విద్యార్థులు

- చట్టాలపై అవగాహన అవసరం
- డోన్ డీఎస్పీ శ్రీనివాసులు

బేతంచెర్ల: సమాజంలో గౌరవ ప్రదమైన జీవితాన్ని ఇచ్చేది చదువు ఒక్కటే అని.. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు చట్టాలు, హక్కులపై అవగాహన పెంచుకోవాలని డోన్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్డీఓ నరసింహులు అన్నారు. గురువారం బేతంచెర్ల మండల పరిధిలోని గోరుమానుకొండ బీసీ బాలుర రెసిడెన్షియల్ స్కూల్‌లో ఎస్సీ, ఎస్టీ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చట్టం దృష్టిలో అందరూ సమానం అన్నారు. చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. లక్ష్యాలను నిర్దేశించుకుని అందుకు అనుగుణంగా కష్టపడితే విజయం సొంతం అవుతుందని తెలిపారు. చిన్నప్పటి నుంచి క్రమశిక్షణతో కూడిన జీవన విధానం అలవర్చుకోవాలన్నారు. ట్రైబర్ వెల్ఫేర్ అధికారి హుసేనయ్య, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కొమ్ముపాలెం శ్రీనివాస్, శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీలు వారికున్న హక్కులు, సంక్షేమ పథకాలు, చట్టాలను తెలుసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయన్నారు. సమాజంలో వివక్షకు గురికాకుండా ఉండేందుకు వాటిని ఉపయోగించుకోవాలని సూచించారు. కులమత బేధాలకు పోకుండా అందరూ కలిసి మెలసి ఉండాలని తెలిపారు. అనంతరం విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఎస్సీ, ఎస్టీ చట్టాలకు సంబంధించిన అవగాహన సదస్సులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సీఐడీ అధికారులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డోన్ తహసీల్దార్ నాగమణి, ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, కర్నూలు సీఐడీ రీజినల్ కార్యాలయం సీఐలు శ్రీధర్, గిరి బాబు, సివిల్ సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ రమేష్ బాబు, ఎంఈఓ సోమశేఖర్, బీసీ రెసిడెన్షియల్ స్కూల్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాళ్లు మరియదాసు, శ్రీనివాసులు గౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు

బేతంచెర్ల: పట్టణంలోని సంజీవనగర్ కాలనీకి చెందిన 7వ తరగతి విద్యార్థి అఖిల్‌ను పాఠశాలకు సక్రమంగా వెళ్లడం లేదని తల్లిదండ్రులు వీరాంజనేయులు, సుబ్బమ్మ బుధవారం మందలించారు. దీంతో బాలుడు ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువుల వద్ద గాలించినా ఆచూకీ తెలియలేదు. దీంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు.

చెల్లెలి ఫిర్యాదుతో అన్నలపై కేసు

బేతంచెర్ల: తన అన్నలు ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్‌ను ఫోర్జరీ చేసి ఉమ్మడి ఆస్తిని ఇతరులకు రిజిస్టర్ చేశారని చెల్లి పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలు కళా నాగవేణి ఫిర్యాదు మేరకు గూటుపల్లె గ్రామానికి చెందిన కుర్ని పెద్దరాజు, కొండయ్యపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు.

పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తులు

బనగానపల్లె రూరల్: ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు, ఈబీసీ, దివ్యాంగ విద్యార్థులు 2024–25 విద్యాసంవత్సరానికి పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవాలని బనగానపల్లె సహాయ సాంఘిక సంక్షేమశాఖ అధికారి కేసీ రాముడు తెలిపారు. కొత్తగా రెన్యూవల్ చేసుకునే విద్యార్థులు ఈ నెల 30వ తేదీ లోపు http://jnanabhumiv2.apcfss.in వెబ్ సైట్ సైట్‌లో కళాశాల జ్ఞానభూమి లాగిన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ పరిధిలోని సచివాలయాల్లో విద్యా సంక్షేమ సహాయకుల ద్వారా లాగిన్ అయ్యి వెరిఫికేషన్ చేయించుకోవాలని తెలిపారు.

దేశానికి వన్నె తెచ్చిన మహనీయుడు సీవీ రామన్





రామన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

డోన్ టౌన్: తన పరిశోధనలతో భారతదేశానికి వన్నె తెచ్చిన మహనీయుడు సీవీ రామన్ అని హెచ్ఎం పద్మావతి అన్నారు. గురువారం పాతపేట జెడ్పీ హైస్కూల్‌లో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీవీ రామన్ కాంతికి విక్షేపణంపై పరిశోధన చేసి సముద్రపు నీటిపై సూర్యకాంతి పడినప్పుడు ఆ కాంతిలోని నీలం రంగు ఎక్కువగా పరిక్షేపం చెంది మన కంటిని చేరడం వల్ల సముద్రం నీలంగా కనిపిస్తుందని అదే రామన్ ఎఫెక్ట్ సిద్ధాంతం అని తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీవీ రామన్ సేవలు చిరస్మరణీయం

భౌతికశాస్త్రవేత్త, నోబెల్ అవార్డు గ్రహీత సీవీ రామన్ సేవలు చిరస్మరణీయమని జ్యోతిరావు పూలే గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ వసుంధరదేవి, సామాజిక కార్యకర్త మమ్మద్ రఫీ అన్నారు. గురువారం సీవీ రామన్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. విద్యార్థులకు ఆయన జీవిత చరిత్రను వివరించారు.

ఇతర శాఖల పనులు అప్పగించొద్దు

అవుకు: ఇతర శాఖలకు సంబంధించిన పనులను తమకు అప్పగించవద్దని ఏఎన్ఎంలు డిమాండ్ చేశారు. ఈ మేరకు అవుకు ఎంపీడీఓ వెంగన్నకు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉషా యూనియన్ జిల్లా ట్రెజరర్ వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ.. ఆరోగ్య శాఖలో ఏఎన్ఎంలకు నిత్యం ఏదో ఒక కార్యక్రమం ఉంటుందని తెలిపారు. దీని వల్ల ఇతర శాఖలకు చెందిన పనిని తీసుకురావద్దని ప్రభుత్వం 124 జీఓను తీసుకొచ్చిందని గుర్తు చేశారు. ఆరోగ్య సంబంధిత కార్యక్రమాలైన ఆర్‌బీఎస్‌కే, క్యాన్సర్ స్క్రీనింగ్ సర్వే, డ్రైడే ఫ్రైడే, ఎన్‌సీడీసీడీ 3.ఓ సర్వే, గర్భిణులు, బా లింతలు, చిన్నారులకు ఎంసీహెచ్ సర్వీసెస్ లాంటి ఎన్నో కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. ఇతర శాఖల పనులను అప్పగించవద్దని కోరారు. ఏఎన్ఎంలు మదారమ్మ, సరస్వతి, అనిత, హైమావతి, చంద్రకళ, స్వరూప పాల్గొన్నారు.

పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న యూనియన్ జోనల్ సెక్రటరీ

డోన్ రూరల్: పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ యూనియన్ జోనల్ సెక్రటరీ ఎం.భరణి భానుప్రసాద్ డిమాండ్ చేశారు. డోన్ పట్టణంలోని మద్రి రాఘవయ్య భవనంలో గురువారం ఆయన మాట్లాడారు. డిసెంబర్ 4,5,6వ తేదీల్లో జరగనున్న రైల్వే ఎన్నికల్లో సౌత్ సెంట్రల్ ఎంప్లాయీస్ యూనియన్‌ను గెలిపించాలని కోరారు. సుమారు 13 ఏళ్ల తర్వాత ఎన్నికలు జరుగుతున్నాయని తెలిపారు. మద్రి రాఘవయ్యను గెలిపిస్తే రైల్వే ఉద్యోగులకు న్యాయం జరుగుతుందన్నారు. సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ యూనియన్ డోన్ చైర్మన్ షేక్ షబ్బీర్ హుసేన్, సెక్రటరీ వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, ట్రెజరీ ప్రదీప్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతికి నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

బేతంచెర్ల: మండల పరిధిలోని రహిమానుపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బొల్లవరం పెద్ద వెంకటేశ్వర్‌రెడ్డి మృతిపై మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సంతాపం తెలిపారు. గురువారం రహిమానుపురం గ్రామానికి వెళ్లి వెంకటేశ్వర రెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన భార్య, ప్రస్తుత సర్పంచ్ ప్రమీలమ్మ, కొడుకు శ్రీనాథ్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ బుగ్గన నా గభూషణం రెడ్డి, సీతారామాపురం సర్పంచ్ వేణు గోపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ జగన్ మోహన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబుల్ రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, రామచంద్రుడు, సీహెచ్ లక్ష్మిరెడ్డి, చందురెడ్డి, జయ ప్రకాశ్‌రెడ్డి, బుగ్గన కుమార్ రెడ్డి ఉన్నారు.

చౌడేశ్వరిదేవి ఆలయానికి విరాళం



ఆలయ అర్చకులకు విరాళం అందజేస్తున్న దాతలు

బనగానపల్లె రూరల్: నందవరం గ్రామంలోని చౌడేశ్వరిదేవి ఆలయాభివృద్ధికి వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన డాక్టర్ యాడికి సాయితేజశ్వరరెడ్డి కుటుంబ సభ్యులు రూ.35,116 విరాళాన్ని అందించినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ గురువారం తెలిపారు. విరాళంలో రూ.25వేలు ఆలయ అభివృద్ధి కోసం, మరో రూ.10,116 నిత్యాన్నదానం కోసం అందించారని చెప్పారు. దాతకు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేసి సత్కరించారు. ఆలయ మాజీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి, అర్చకులు ఉన్నారు.

ఐదు కేజీలకు మించి బెల్లం విక్రయించొద్దు



వ్యాపారులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ

బనగానపల్లె రూరల్: కిరాణ దుకాణ వ్యాపారులు ఒక వ్యక్తికి ఐదు కేజీలకు మించి బెల్లం విక్రయించొద్దని బనగానపల్లె ఎక్సైజ్ శాఖ సీఐ వర్ధనాదేవి అన్నారు. గురువారం స్థానిక ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలో పట్టణంలోని కిరాణ దుకాణ వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. సారా తయారీకి బెల్లం వినియోగిస్తున్న క్రమంలో వ్యాపారులు ఒక వ్యక్తికి ఐదు కేజీలకు మించి బెల్లం విక్రయించవద్దని సూచించారు. అంతకు మించి కావాల్సిన వారి వివరాలు నమోదు చేసి విక్రయించాలని ఆదేశించారు. దుకాణంలో బెల్లం స్టాక్, అమ్మకాల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పుస్తక పఠనంలో విజ్ఞానం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న హెచ్ఎం

సంజామల: విద్యార్థులు క్రమం తప్పకుండా గ్రంథాలయానికి వెళ్లి పుస్తకాలను చదవడం ద్వారా విజ్ఞానం, ఆలోచన శక్తి పెరుగుతుందని పాఠశాల హెచ్ఎం విజయ కుమార్ అన్నారు. గురువారం మండల పరిధిలోని గిద్దలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థుకు వివిధ పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు గిద్దలూరు పుస్తక నిక్షిప్త కేంద్రం నిర్వాహకుడు మద్దిలేటి ఆధ్వర్యంలో బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సంజామల గ్రంథాలయ అధికారి తిమ్మారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైల్వే పనుల పరిశీలన

డోన్ రూరల్: పట్టణంలోని రైల్వేస్టేషన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం గుంతకల్ ఏడీఆర్ఎం సుధాకర్ పరిశీలించారు. పనులపై రైల్వే అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే బుకింగ్ కౌంటర్, రైల్వే స్టేషన్‌ను పరిశీలించారు. స్టేషన్‌ను శుభ్రంగా ఉంచాలని, ప్రయాణికులకు అన్ని సౌకర్యాలు ఉండేలా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు.

నేలరాలిన జొన్న పంట



పూర్తిగా నేలకొరిగిన జొన్న పంట

కొలిమిగుండ్ల: పెనుగాలులు లేవు, వర్షం లేదు అయినా సాగులో ఉన్న జొన్న పంట అకస్మాత్తుగా నేలకొరిగిపోయింది. ఈ సంఘటన గురువారం కోటపాడులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు మోహన్‌రెడ్డి కొత్త వంగడాలతో రకరకాల పంటలు సాగు చేస్తుంటాడు. ఈ కోవలోనే ఎకరా విస్తీర్ణంలో 50 రోజుల క్రితం రాయచూరు రకం జొన్న సాగు చేశాడు. ఉన్నట్లుండి పంట మొత్తం నేలకొరిగిందని రైతు పేర్కొన్నాడు. ఇంకో రకం జొన్న ఆరు ఎకరాల్లో సాగు చేసినా పంట బాగుందన్నారు. ఎందుకిలా జరిగిందో అర్థం కావడం లేదన్నారు.

రహదారి కష్టాలు

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని జగనన్న కాలనీ ప్రజలు రహదారి కష్టాలు ఎదుర్కొంటున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించి కాలనీలో 250 మందికి ఇళ్ల స్థలాలు, పక్కాగృహాలు కేటాయించింది. 50 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుని అక్కడ నివాసం ఉంటున్నారు. మరికొందరు ఇళ్లను నిర్మించుకుంటున్నారు. ఆర్అండ్‌బీ రోడ్ నుంచి కాలనీకి ఏర్పాటు చేసిన మట్టి రోడ్డు పూర్తిగా దెబ్బతినింది. పెద్ద గుంతలతో దర్శనమిస్తోంది. అక్కడ నివాసం ఉంటున్న కాలనీవాసులు ఈ రహదారిపై రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో గుంతల్లో నీరు నిల్వ చేరడంతో కాలనీలోకి వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. కొత్తగా ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులు ఇంటి సామగ్రిని తరలించేందుకు అగచాట్లు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిని సీసీరోడ్డుగా మార్చాలని కోరుతున్నారు.



కోవెలకుంట్లలో జగనన్న కాలనీకి వెళ్లే రహదారి దుస్థితి

ఘనంగా టీవీ డే



రోగులకు పండ్లు, బ్రెడ్లు అందజేస్తున్న మెకానిక్‌లు

డోన్ టౌన్: నేటి ఆధునిక సమాజంలో టీవీల పాత్ర ముఖ్యమైందని ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మమ్మద్ హనీఫ్ అన్నారు. ప్రపంచ టెలివిజన్ డే సందర్భంగా గురువారం పట్టణ టీవీ మెకానిక్‌ల ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. టీవీ మెకానిక్ అసోషియేషన్ అధ్యక్షుడు అన్వర్‌బాషా, ఉపాధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి సంగీతం శ్రీను, మల్లికార్జునరెడ్డి, వరప్రసాద్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఇంటింటి ఆరోగ్య పరీక్షలను నిర్లక్ష్యం చేయొద్దు



సర్వేను పరిశీలిస్తున్న మలేరియా ప్రోగ్రాం ఆఫీసర్

బనగానపల్లె రూరల్: ఇంటింటి ఆరోగ్య పరీక్షలను సక్రమంగా చేపట్టాలని జిల్లా మలేరియా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కామేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఉన్న రక్త పరీక్ష ల్యాబ్ రికార్డులు, ఓపీ విభాగాన్ని పరిశీలించారు. డెంగీ, మలేరియా పరీక్షలను పకడ్బందీగా చేయాలని ల్యాబ్ టెక్నీషియన్ హసీనాకు సూచించారు. అలాగే ఎన్‌సీడీసీడీ– 3.0 సర్వేను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ శివశంకరుడు ఉన్నారు.

పాఠశాలల పనివేళల మార్పు సరికాదు



ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి

బనగానపల్లె రూరల్: పాఠశాలల పనివేళల మార్పు నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి అన్నారు. గురువారం స్థానిక సంఘం కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయం వల్ల గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి ఉంటుందన్నారు. వారి సమస్యలను దృష్టిలో ఉంచుకుని పాఠశాలల పనివేళలను యథావిధిగా ఉంచాలని కోరారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్‌రావు, ఉపాధ్యాయులు సుబ్బరాయుడు, రమేష్, రామస్వామి పాల్గొన్నారు.